బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 11 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4

## ఏడుపాయలలో హుండీల చోరీ



**బలగం టీవి, పాపన్న పేట**

మెదక్ జిల్లా ఏడుపాయల దేవాలయంలో భారీ చోరీ జరిగింది. గర్భ గుడి ముందున్న 2 హుండీలను శుక్రవారం రాత్రి దొంగలు అపహరించారు. శనివారం తెల్లవారుజామున ఆలయం వద్దకు చేరుకున్న పూజారులు.. హుండీలు మాయమైన దృశ్యాన్ని గమనించారు. దీంతో పూజారులు పోలీసులకు సమాచారం అందించారు.ఏడుపాయల ఆలయం వద్దకు చేరుకున్న పోలీసులు.. పరిసర ప్రాంతాలను పరిశీలించగా, పాత కల్యాణకట్ట వద్ద హుండీలు కనిపించాయి. రెండు హుండీలను ధ్వంసం చేసి నగదు, విలువైన కానుకలను దొంగలు అపహరించిన ఆనవాళ్లు ఉన్నాయి. పది రోజుల క్రితమే ఆలయంలోని హుండీలను సిబ్బంది లెక్కించారు. ఈ చోరీ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పాపన్నపేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# కొత్త రేషన్ కార్డులకు గ్రీన్ సిగ్నల్..

## గ్రామాల్లో లక్షన్నర.. పట్టణాల్లో రూ. 2 లక్షలు..!

- ఆ లోపు ఆదాయం ఉండాలని సమాచారం
- ప్రజాప్రతినిధులు సలహాలు తీసుకుని త్వరలోనే ప్రకటించే అవకాశం
- విధివిధినాలపై మంత్రి ఉపసంఘం చర్చ



**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీకి రేవంత్ రెడ్డి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త రేషన్ కార్డుల జారీపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యతన జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో.. కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణలోని అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని నిర్ణయించారు. పాత రేషన్ కార్డుల స్థానంలో కూడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై కూడా చర్చించిన సబ్ కమిటి.. మిగతా ప్రజాప్రతినిధులు సలహాలు తీసుకుని త్వరలోనే ప్రకటించనున్నట్టు తెలుస్తోంది.కొత్తగా ఇచ్చే రేషన్ కార్డులు.. స్వైపింగ్ కార్డుల తరహాలో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఇక.. కొత్తగా మంజూరు చేసే రేషన్ కార్డులకు సంబంధించిన విధివిధానాలపై కూడా చర్చించగా.. తదుపరి సమావేశంలో అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలుస్తోంది.

కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, సభ్యులు దామోదర రాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమావేశమై రేషన్ కార్డుల జారీకి అర్హతలు, విధివిధానాలపై కసరత్తు చేశారు. ఇప్పటికే ఉన్న వారితో పాటు, అర్హులకు కొత్తగా తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అర్హతలు, విధివిధానాలపై అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. రెండు రాష్ట్రాల్లో తెల్ల రేషన్ కార్డులు ఉన్న వారికి, ఏదో ఒక చోట ఉండేలా నిర్ణయించుకునేందుకు ఆప్షన్ ఇవ్వాలని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం నియమించిన సక్సేనా కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో తెల్లరేషన్ కార్డుల జారీపై అధికారులు అధ్యయనం చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89 లక్షల 96 వేల రేషన్ కార్డులు ఉండగా, సుమారు పది లక్షల దరఖాస్తులు కొత్తగా వచ్చాయని మంత్రి చెప్పారు. అర్హతలు, విధివిధానాలపై సూచనలు స్వీకరించిన తర్వాత మరోసారి సమావేశమై ఖరారు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారెవరూ అవకాశం కోల్పోకుండా లోతైన అధ్యయనం చేస్తామని మంత్రి ఉత్తమ్ చెప్పారు.

అయితే.. కొత్తగా పంపిణీ చేసే తెల్లరేషన్ కార్డులు పొందేందుకు.. కొన్ని నిబంధనలు కూడా పెట్టాలని సబ్ కమిటీ నిర్ణయించినట్టు తెలుస్తోంది. లబ్దిదారులకు భూమి విషయంతో పాటు ఆదాయం విషయంలో నిబంధనలు పెట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇందులో భాగంగానే.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారి వార్షిక ఆదాయం లక్షన్నరగానూ, మాగాణి మూడున్నర ఎకరాలు, చెలక ఏడున్నర ఎకరాలుగా ఉండాలని సబ్ కమిటీ నిర్ణయించినట్టు సమాచారం.. ఇక.. పట్టణ ప్రాంతాల్లో ఉంటున్నవారి వార్షిక ఆదాయం 2 లక్షలు ఉన్నవారికే కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని యోచిస్తున్నట్టు సమాచారం. మరోవైపు.. పాత కార్డుల స్థానంలో కొత్తకార్డులు ఇవ్వాలని, అది కూడా స్వైపింగ్ మోడల్‌లో ఉండాలని నిర్ణయం తీసుకున్నారు.

**ప్రతిపక్షం నుంచి సలహాలు, సూచనలు..**

ఇక కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారెవరూ ఈ అవకాశం కోల్పోకుండా ఉండేలా లోతైన అధ్యయనం జరుపుతున్నామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులందరి నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నట్లు తెలిపారు. తక్షణమే రాజ్యసభ, లోకసభ, శాసనసభ, శాసనమండలి సభ్యులందరికీ లేఖలు రాసి విధి విధినాలలో వారి

మిగితా 2వ పేజీలో



## హైదరాబాద్‌లో జొయిటిస్ విస్తరణ

- ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రారంభం
- అమెరికాలో సీఎంతో భేటీ అయిన కంపెనీ ప్రతినిధులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జొయిటిస్ కంపెనీ హైదరాబాద్‌లో తమ కెపాబులిటీ సెంటర్ ను విస్తరించాలని నిర్ణయించింది. 2024 సెప్టెంబర్ నుంచి ఈ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో వందలాది మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయి.

హైదరాబాద్‌లోని జొయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించనున్నట్లు ప్రకటించింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు అధికారుల బృందంతో కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో తమ జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించే నిర్ణయాన్ని స్వాగతించారు. తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు, వ్యాపార వృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని అన్నారు.

హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్ గా తీర్చిదిద్దాలనే తమ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడుతాయన్నారు. వందలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలో జొయిటిస్ రంగ ప్రవేశం హైదరాబాద్ కు మరింత గుర్తింపు తెస్తుందన్నారు. ఇండియాలో తమ కంపెనీ విస్తరణకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని, తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావటం సంతోషంగా ఉందని జొయిటిస్ కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్‌బాగ్ అన్నారు. తమ కంపెనీ విస్తరణ జంతు ఆరోగ్యానికి సంబంధించి సరి కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందన్నారు.

తెలంగాణలో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి ప్రతిభా వనరులను సద్వినియోగం చేసుకుంటామని జొయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్ అన్నారు. ప్రపంచంతో పోటీ పడే సేవలందించటంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటామన్నారు.

జొయిటిస్ కంపెనీ విస్తరణ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వనరులు, తమ ప్రభుత్వ విధానాలపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబించిందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్?బాబు అన్నారు. రాబోయే సంవత్సరాల్లో కొత్త ఉద్యోగాలతో పాటు జంతు ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్లో కంపెనీ విస్తరణకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు.

జొయిటిస్ కంపెనీ దాదాపు 70 సంవత్సరాలుగా జంతువుల అనారోగ్యం, రోగ నిర్ధారణ, నిరోధించే మార్గాలు, చికిత్స సంబంధిత అంశాలపై పని చేస్తోంది. జంతు సంరక్షణలో భాగంగా పశు వైద్యులు, పెంపుడు జంతువుల యజమానులు, రైతులకు అండగా నిలుస్తోంది. ఔషధాలతో పాటు వ్యాక్సిన్‌లు, రోగ నిర్ధారణలో కొత్త సాంకేతికత, ఆవిష్కరణలపై దాదాపు వంద దేశాలకు సేవలు అందిస్తోంది.

## వయనాడ్‌లో పర్యటించిన ప్రధాని మోడీ



**బలగం టీవి, వయనాడ్**

జూలై 30న కొండచరియలు విరిగిపడటంతో సంభవించిన వినాశనాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రధాని మోడీ శనివారం వయనాడ్ లోని కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను సందర్శించారు. అక్కడ బాధితులను పరామర్శించారు. సహాయ,పునరావాస చర్యలపై ఆరా తీశారు. ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా కేరళ ఏడీజీపీ (శాంతిభద్రతలు) ఎంఆర్ అజిత్ కుమార్ ప్రధానికి ప్రమాదం పూర్వాపరాలను వివరించారు. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేరళ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధితులను పరామర్శించేందుకు మోదీ వయనాడ్ లోని సహాయ శిబిరాన్ని సందర్శించారు. విపత్తు చోటు చేసుకున్న ప్రదేశాన్ని సందర్శించే ముందు, వయనాడ్ లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలను అంచనా వేయడానికి ప్రధాని ఏరియల్ సర్వే నిర్వహించారు.

సర్వే అనంతరం ప్రధాని మోడీ కల్పేటలోని ఎస్‌కేఎంజే హయ్యర్ సెకండరీ స్కూల్‌లో దిగారు. ప్రభావిత ప్రాంతానికి వెళ్లి రెస్క్యూ ఆపరేషన్, బాధితుల తరలింపు జరిగిన తీరును అధికారులు ప్రధానికి వివరించారు. ప్రధాని వెంట సీఎం పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేంద్ర మంత్రి సురేశ్ గోపి ఉన్నారు. ప్రధాని వెంట సీఎం పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేంద్ర మంత్రి సురేశ్ గోపి ఉన్నారు.



## మూడు రోజుల పాటు శ్రీవారి సేవలు రద్దు..!

**బలగం టీవి, తిరుమల**

తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో జరిగే ఆర్జిత సేవలను మూడు రోజుల పాటు రద్దు చేస్తున్నట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆగష్టు 15 నుంచి 17వ తేదీ వరకు ఈ సేవలు రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. ఆగస్టు 14న అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. 15న తిరుప్పావడ సేవను, అలానే15 నుండి 17వ తేదీ వరకు జరిగే శ్రీవారి కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది.ఇక అంకురార్పణ పవిత్రోత్సవం ఆగస్టు 14 నుంచి ప్రారంభం కానుందని.. ఈ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపనతిరుమంజనం నిర్వహించనున్నట్లు టీటీడీ తెలిపింది. అదే విధంగా ప్రతిరోజూ సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు.అదే సమయంలో తొండమాన్ పురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆగస్టు 17 నుంచి 19 వరకు సంప్రోక్షణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 16న సాయంత్రం 6 గంటలకు అంకురార్పరణంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. ఆ మూడు తేదీల్లో తిరుమలకు వెళ్లే శ్రీవారి భక్తులు శ్రీవారి ఆర్జిత సేవల రద్దును గమనించవచ్చు.

తెలంగాణలో
## కొత్త విమానాశ్రయాల ఏర్పాటును పరిశీలిస్తాం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**బలగం టీవి, శంషాబాద్**

తెలంగాణలో కొత్త ఎయిర్ పోర్టుల ఏర్పాటుకు పరిశీలిస్తామని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో నేడు విమానయాన భద్రత వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు హయాంలోనే శంషాబాబ్ ఎయిర్ పోర్టుకు అంకురార్పణ జరిగిందని అన్నారు. చంద్రబాబు విజన్ కారణంగానే శంషాబాద్ ఎయిర్ పోర్టు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోగలిగిందని వివరించారు. నాడు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు భూమి కేటాయించిన సమయంలో, అంత భూమి ఎందుకు కేటాయించారని కొందరు విమర్శించారని తెలిపారు. ఇప్పుడీ విమానాశ్రయం ఎంతటి పేరుప్రఖ్యాతులు సంపాదించుకుందో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఇక, తెలంగాణలో కొత్త ఎయిర్ పోర్టుల ఏర్పాటుకు పరిశీలిస్తామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రామ్మోహన్ నాయుడు శంషాబాద్ ఎయిర్ పోర్టులో మొక్కలు నాటారు. అందరూ మొక్కలు నాటాలన్నది ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు అని, పర్యావరణ పరిరక్షణలో మొక్కలు నాటడం ఎంతో ముఖ్యమని వివరించారు.

## సుంకిశాల ప్రమాదానికి బాధ్యులెవరు..?



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాహుల్ గాంధీకి ఎక్స్‌లో ప్రశ్నలు

**బలగం టీవి, హైదరాబాద్**

సుంకిశాల ప్రమాదంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు ? సుంకిశాల ప్రమాదానికి ఎవరు బాధ్యులు? అంటూ ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదాన్ని చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారు ? సుంకిశాల ప్రమాదంపై ప్రభుత్వం నుంచి ఎవరూ మాట్లాడడం లేదంటూ నిలదీశారు. నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని ఎవరు ఆపుతున్నారని ప్రశ్నించిన ఆయన.. సుంకిశాల ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణకు స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ సహకారం




- బయోడిజైన్ రంగంలో నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యం
- ప్రభుత్వంతో భాగస్వామ్యం.. శాటిలైట్ సెంటర్ పై ఆసక్తి
- ముఖ్యమంత్రికి లేఖను అందించిన యూనివర్సిటీ బృందం

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు కాలిఫోర్నియాలోని స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ ముందుకు వచ్చింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో , పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సహా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించింది. స్టాన్ ఫోర్డ్ బైర్స్ సెంటర్ ఫర్ బయోడిజైన్ విభాగంలోని సీనియర్ ప్రతినిధులతో సమావేశమైంది. ఈ సందర్భంగా హెల్త్ కేర్ రంగంలో కొత్త ఆవిష్కరణలు, విద్య, నైపుణ్య అభివృద్ధి అంశాలపైనే ప్రధానంగా చర్చలు జరిగాయి.

తెలంగాణలో ఏర్పాటు చేసే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, న్యూ లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీలో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రభుత్వం స్టాన్ ఫోర్డ్ వారిని ఆహ్వానించింది. పరస్పరం అధునాతన పరిజ్ఞానాన్ని పంచుకునే కార్యక్రమాలతో పాటు ఉమ్మడిగా పరిశోధనలు నిర్వహించాలనే అభిప్రాయాలు ఈ సమావేశంలో వ్యక్తమయ్యాయి. తెలంగాణలో స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ శాటి లైట్ సెంటర్‌ను ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలపై చర్చలు జరిగాయి.

మిగితా 2వ పేజీలో

## హిమాచల్ ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు..128 రోడ్లు మూసివేత

**బలగం టీవి, హైదరాబాద్**

హిమాచల్ ప్రదేశ్‌లో శనివారం పలుప్రాంతాల్లో ఉరుములు , మెరుపులతో భారీ వర్షాలు కురిశాయి. ఈమేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఆగస్టు 16 వరకు భారీ వర్షాలు పడతాయని వాతావరణ విభాగం హెచ్చరించింది. నహాన్‌లో శుక్రవారం సాయంత్రం నుంచి అత్యధికంగా 168.3 మిమీ వర్షపాతం నమోదైంది. సంధోల్‌లో 106.4 కిమీ, నగ్రోటా సూరియన్‌లో 93.2 మిమీ , ధౌలకువాన్‌లో 67 మిమీ, జుబ్బర్‌హట్టిలో 56.2 మిమీ , కందఘహట్టిలో 45.6 మిమీ వర్షపాతం నమోదైంది.భారీ వర్షాలకు పలు ప్రాంతాలు జలమయమై, రోడ్లు దెబ్బతిన్నాయి. వంతెనలు కొట్టుకుపోయాయి. విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొండచరియలు విరిగి పడుతుండడంతో ముందు జాగ్రత్తగా 128 రోడ్లను అధికారులు మూసివేశారు.

## సొంత ఊరోళ్లకే
# ఇండ్లు కట్టియ్యని కేసీఆర్



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశానికి దశ దిశ చూపిస్తా అని ప్రగల్బాలు పలికిన కేసీఆర్, ఊరోళ్లకే ఇండ్లు కట్టియ్యలేదనిమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. తన పుట్టినిల్లు అయిన చింతమడక గ్రామంలో సీఎం హోదాలో పర్యటించిన కేసీఆర్, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తానని పేదోళ్ల ఇళ్లన్నీ కూల్చేసి, ఇప్పటి వరకు వారికి నిలువ నీడ లేకుండా చేశారన్నారు.

గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నేతలంతా ఫామ్‌హౌజ్‌లు కట్టుకుని పేదలకు ఇంటి సౌకర్యాలను విస్మరిస్తే, ఇప్పుడు పేదలకు నివాస వసతిని కల్పిస్తున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం, పేదల మేలు కోరే ప్రభుత్వమని, అందుకే ఇందిరమ్మ రాజ్యం అని గర్వంగా చెప్పుకుంటున్నామని మంత్రి తెలిపారు. తక్షణమే చింతమడకలో పర్యటించి ఇండ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఏ పేదవాడూ ఇళ్లు లేకుండా ఇబ్బంది పడకూడదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఎలాంటి భేషజాలకు పోకుండా వీలైనంత త్వరగా చింతమడకలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చింతమడకలో పేదల కష్టాలపై స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్ నిర్వాకం వల్ల ఇల్లు పీకి పందిరి వేసిన చందంగా ఉందని ధ్వజమెత్తారు. కేసీఆర్‌ను నమ్ముకుంటే ఉన్న ఇల్లు పాయె, గుడిసె పాయె విధంగా ఉందని విమర్శించారు.

పెద్ద సారు చేసిన ప్రకటనను నమ్మి తమ ఇళ్లను, గుడిసెలను అక్కడి నిరుపేదలు సర్కారుకు అప్పగించగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం వాటిని కూల్చారని మంత్రి వివరించారు. ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన మేరకు లబ్ధిదారులను గుర్తించి 1909 ఇళ్లను అధికారులు మంజూరు చేశారని, కానీ 1215 ఇళ్లను నిర్మించడానికి మాత్రమే కాంట్రాక్టర్లు ఒప్పందం చేసుకుని మిగతా 694 ఇళ్లకు అగ్రిమెంట్ జరగలేదన్నారు. నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని, గత ఏడాది డిసెంబర్ నాటికి నాలుగు సంవత్సరాలలో 1103 ఇళ్లను మాత్రమే పూర్తి చేశారని తెలిపారు. ఇంకా 148 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో దాదాపు 60 నుంచి 70 కుటుంబాలు ఉన్న ఇంటిని, గుడిసెలను కోల్పోయి రోడ్డున పడ్డాయని మంత్రి పొంగులేటి వివరించారు. పలువురు పేదలు పొలంగట్ల దగ్గర గుడిసెలు వేసుకున్నారని మరి కొంతమంది ఇతర ప్రాంతాలకు వలస పోయారని మంత్రి పేర్కొన్నారు.

# హిండెన్‌బర్గ్ సంచలన నివేదిక




**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ప్రపంచవ్యాప్త ఆర్థిక వ్యవహారాల సంచలనాత్మక విశ్లేషణల వేదిక హిండెన్‌బర్గ్ అదానీ, అంబానీల ఆర్థిక లావాదేవీలపై తీవ్రస్థాయి ఆరోపణలకు దిగింది. భారతీయ మార్కెట్లలో తీవ్రస్థాయి ప్రకంపనలకు దారితీసే విషయాలను హిండెన్‌బర్గ్ వరుసగా రెండురోజులు శుక్రవారం, శనివారం వెలుగులోకి తెచ్చింది. తమ వద్ద ఉన్న విజిల్ బ్లోయర్ డాక్యుమెంట్ల మేరకు అదానీ బినామీ కంపెనీలకు సెబీ ఛైర్‌పర్సన్ మాధబి బచ్, ఆమె భర్తకు సంబంధం ఉందని, వీటిలో వీరిరువురికి వాటాలు ఉన్నాయని హిండెన్‌బర్గ్ తాజా సంచలనంలో పేర్కొంది. పలు డొల్ల కంపెనీలతో అదానీ భారీ స్థాయిలో డబ్బుల అక్రమాలు సాగించారని, ఈ మనీ సైఫనింగ్ స్కాండల్‌కు సెబీ అధినేత్రి పెద్ద ఎత్తున సహకరించడం , ఈ దంపతులకు ఆయా కంపెనీలలో వాటాలు ఉండటం కీలక పరిణామమని హిండెన్‌బర్గ్ సామాజిక మాధ్యమంలో పేర్కొంది. ఇంతకు ముందు తాము పేర్కొన్న నివేదికలో అదానీ అక్రమ లావాదేవీలు ఎటువంటి జంకుగొంకూ లేకుండా సాగాయని తెలిపామని, సెబీ నుంచి ఎటువంటి నియంత్రణల క్రమం లేకుండా సాగిందని తెలిపామని గుర్తు చేశారు. అయితే ఇదంతా కూడా సెబీ సారథితో అదానీకి ఉన్న లోపాయికారి వ్యవహారంతో సాధ్యమైందని ఇప్పుడు చెపుతున్నామని వివరణ ఇచ్చారు. ప్రస్తుత సెబీ ఛైర్‌పర్సన్ ఆమె భర్తకు అదానీకి బెర్ముడా, మారిషస్ నిధులలో ఉన్న గుప్త వాటాల విషయం గురించి ఇంతకు ముందు తెలియదని , ఇప్పుడు నిజాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. సెబీ ఛైర్‌పర్సన్, ఆమె భర్త ధావల్ బచ్ సింగపూర్‌లో తొలుత ఐపిఇ ప్లస్ ఫండ్ 1 పేరిట 2015 జూన్ 5న వారి ఖాతాలు తెరిచారని తమకు కీలక పత్రాలతో తేలిందన్నారు. వీరు తమ వాటాల సంబంధిత డిక్లరేషన్‌లో తమకు ఆదాయం ద్వారా వచ్చిన దాదాపు 10 మిలియన్ డాలర్ల లెక్కలు చూపారని హిండెన్‌బర్గ్ తెలిపింది. త్వరలోనే భారత్ సంబంధిత మరో లోగుట్టు అని కూడా ఈ అమెరికా సంస్థ పేర్కొంది .

హిండెన్‌బర్గ్ తమ వెల్లడిలో ముఖేష్ అంబానీ సారథ్యపు రిలయన్స్‌పై కూడా సంచలనాత్మక ఆరోపణలు చేసింది. ఈ కంపెనీ భారీ సాథయిలో దూకుడు తరహాల లావాదేవీలు సాగించింది. సంబంధిత సంస్థలతో పలు అనుమానాస్పద ఒప్పందాలకు దిగిందని వివరించారు. లాభ నష్టాల వెల్లడిలో అక్రమాలు జరిగాయని తెలిపారు. పైగా కంపెనీ లెక్కలపద్ధతులు వక్రీకరణలతో ఉన్నాయి. పారదర్శకత లేదని తెలిపారు. ఈ ఆరోపణపై రిలయన్స్ సంస్థ స్పందించలేదు. అయితే హిండెన్‌బర్గ్ నవేదికతో మార్కెట్‌లో ప్రకంపనల కారణంగా రియలన్స్ ఇండస్ట్రీ షేర్ల విలువ పడిపోయింది. కాఆ ఇప్పుడు తాము ప్రాథమికంగా విషయాలను వెలుగులోకి తీసుకువచ్చామని, రిలయన్స్ స్పందన చూసి తరువాతి దర్యాప్తు జరిపించి , తుది నిర్ధారణలతో పూర్తి స్థాయి వివరాలు వెల్లడిస్తామని కూడా హిండెన్‌బర్గ్ పేర్కొంది .



# జమ్మూ కశ్మీర్‌లో ఎన్‌కౌంటం

- ఇద్దరు జవాన్ల వీరమరణం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

జమ్మూ కాశ్మీర్‌లోని అనంతనాగ్‌లో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఆర్మీ జవాన్లు వీరమరణం పొందారు. ఒకరు గాయపడ్డారు. అనంత్‌నాగ్ జిల్లా కోకెర్‌నాగ్‌లోని అహ్లాన్ అటవీ ప్రాంతంలో శనివారం మధ్యాహ్న సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని శ్రీనగర్‌లోని 'చినార్ కార్ప్స్ ఆఫ్ ఇండియన్ ఆర్మీ' ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం అందడంతో భద్రతా బలగాలు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయని, గాలింపు చేపడుతున్న బృందాన్ని ట్రాప్ చేసి ఉగ్రవాదులు కాల్పులు జరిపారని అధికారులు వివరించారు. ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారని భావిస్తున్నట్టు తెలిపారు. గాయపడ్డ ముగ్గురు సైనికులను సమీపంలోని హాస్పిటల్‌కు తరలించగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని, ఒకరు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సాధారణ పౌరులు కూడా గాయపడ్డారని, ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని వివరించారు.

# గూగుల్ ప్రధాన కార్యాలయానికి సీఎం




తెలంగాణ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగాల కల్పనకు తోడ్పడే పెట్టుబడుల సేకరణ, ఒప్పందాల నిమిత్తం అమెరికాలో పర్యటిస్తోన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలిఫోర్నియాలోని మౌంటేన్ వ్యూలో గల ప్రఖ్యాత గూగుల్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి వెంట పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.
తెలంగాణలో టెక్ సేవల విస్తృతి, ఏఐ సిటీ నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు తదితర ప్రాజెక్టుల్లో భాగం పంచుకునే విషయమై గూగుల్ సంస్థ ఉన్నతాధికారులతో తెలంగాణ బృందం చర్చలు జరిపింది.

**బలగం టీవీ, హైదరాబాద్**






# తెలంగాణకు స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ సహకారం



(మొదటి పేజీ తరువాయి)

స్టాన్‌ఫోర్డ్ అధ్వర్యంలో జరిగే బయోడిజైన్ ఆవిష్కరణలను రాష్ట్రంలో అకడమిక్, హెల్త్ కేర్ విభాగాలకు అనుసంధానం చేయాలని తన ఆలోచనలను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వారితో పంచుకున్నారు. ఈ సమావేశం అనంతరం తెలంగాణ ప్రభుత్వానికి తగిన సహకారం అందిస్తామని యూనివర్సిటీలోని బయోడిజైన్ విభాగం అధిపతులు డాక్టర్ అనురాగ్ మైరాల్, డాక్టర్ జోష్ మాకోవర్ ప్రకటించారు. తమ ఆసక్తిని వ్యక్తం చేస్తూ వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖను అందించారు.భారీ వైద్య పరికరాల పరిశ్రమను అభివృద్ధి చేసేం దుకు తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిందని, దీంతో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని లేఖలో ప్రస్తావించారు. వైద్య పరికరాల విద్య, కొత్త ఆవిష్కరణలకు తమ మద్దతు ఉంటుందని ఆ లేఖలో స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, స్టాన్ ఫోర్డ్ లాంటి ప్రఖ్యాత యూనివర్సిటీతో భాగస్వామ్యం పంచుకోవటం తెలంగాణ యువత భవితకు కొత్త బాటలు వేస్తుందన్నారు. హెల్త్ కేర్ రంగంలో యువతకు నైపుణ్యాల అభివృద్ధిని అందించేందుకు స్టాన్ ఫోర్డ్ భాగస్వామ్యం కోరినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలో పరిశ్రమలు, కొత్త ఆవిష్కరణల్లో తెలంగాణ ముందంజలో ఉందని చెప్పారు. స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ లాంటి ప్రపంచ స్థాయి విభాగాలు కలిసి వస్తే స్కిల్స్ డెవెలప్మెంట్ లో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడ్డారు. ఈ భాగస్వామ్యం ఒక్క తెలంగాణ వృద్ధికే కాకుండా.. యావత్ ప్రపంచానికి హెల్త్ కేర్ రంగంలో కీలకంగా నిలుస్తుందని అన్నారు.

స్టాన్ ఫోర్డ్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏర్పాటయ్యే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, లైఫ్ సైన్సెస్ యూనివర్శిటీల లక్ష్యం నెరవేరుతుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణలో లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ పరిశ్రమల వృద్ధికి మరో ముందడుగు పడుతుందన్నారు.

# వినేశ్ వెండి పతకంపై నేడు తీర్పు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

విశ్వ క్రీడల్లో భారత రెజ్లర్ వినేశ్ ఫోగట్ కు వెండి పతకంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడలేదు. శనివారం వినేశ్ అనర్హతపై విచారణ చేపట్టిన స్పోర్ట్స్ అర్బిట్రేషన్ కోర్టు తీర్పును మొదట ఆగస్టు 13కు వాయిదా వేసింది. ఆ తర్వాత ఓ ప్రకటనలో ఒలింపిక్స్ ముగింపు వేడుకల రోజు సాయంత్రం ఏదో ఒకటి తేల్చేస్తామని చెప్పింది. అయితే సీఏఎస్ అడ్‌హక్ కమిటీ ఆగస్టు 11(నేడు) సాయంత్రం 6 గంటలకు తీర్పును వెలువరించనుంది. వినేశ్ ఫోగట్ వర్సెస్ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కేసులో అర్బిట్రేటర్ డాక్టర్ అన్నబెల్లే బెన్నెట్ నిర్ణయం తీసుకోనున్నారు అని సీఏఎస్ వెల్లడించింది.

పారిస్ ఒలింపిక్స్ ఫైనల్ ముందు తనను అనర్హురాలిగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ వినేశ్ ఫోగట్ ఆగస్టు 7 బుధవారం అర్బిట్రేషన్ కోర్టుకు అప్పీల్ చేసింది. గురువారం సదరు కోర్టు భారత రెజ్లర్ వినతిని స్వీకరించింది. వినేశ్ తరఫున వాదనలు వినిపించేందుకు భారత ప్రభుత్వ మాజీ సొలిసిటర్ జనరల్ హరిష్ సాల్వే సైతం సిద్ధమయ్యారు. కానీ, అర్బిట్రేషన్ కోర్టు తీర్పును ఆగస్టు 11 మంగళవారానికి వాయిదా వేసింది.




ఒలింపిక్స్ 50 కిలోల విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్ ఫోగట్‌కు బుధవారం ఊహించని షాక్ తగిలింది. 100 గ్రాముల అదనపు బరువు కారణంగా నిర్వాహకులు ఆమెను అనర్హురాలిగా ప్రకటించారు. దాంతో, భారమైన హృదయంతో ఆమె రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికింది. అనంతరం అడ్ హక్ ప్యానెల్ క్రీడా కోర్టులో తనకు న్యాయం చేయాలని, గురువారం జరుగబోయే ఫైనల్లో తనను అనుమతించాలని అప్పీల్ చేసింది. కానీ, సదరు కోర్టు ఆలస్యంగా స్పందించింది. సీఏసీ అనేది ఒక అంతర్జాతీయ సంస్థ. క్రీడలకు సంబంధించిన వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరిస్తుంటుంది.

భారత మాజీ సొలిసిటర్ జనరల్ అయిన హరిష్ సాల్వే భారత్‌లో పేరు మోసిన లాయర్. హై ప్రొఫైల్ కేసులకు ఆయన కేరాఫ్. పలువురు ప్రముఖుల కేసులను వాదించిన అనుభవం ఆయనకు ఉంది. అంతర్జాతీయ కోర్టులో భారత నేవీ అధికారి కుల్దీప్ జాదవ్ కేసును హరిష్ సమర్థంగా వాదన వినిపించారు. సైరస్ మిస్త్రీ రతన్ టాటా కేసులో ఈ న్యాయకోవిదుడు టాటా తరఫున పోరాడాడు. అంతేకాదు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆరుషి హేమ్‌రాజ్ జంట హత్యల కేసుకు డిఫెన్స్ అటార్నీగా హరిష్ వ్యవహరించారు.

# ముగిసిన అమెరికా పర్యటన

- ఇక దక్షిణ కొరియాకు రేవంత్ బృందం

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

రాష్ట్రానికి భారీ పెట్టుబడులే లక్ష్యంగా ఎనిమిది రోజుల పాటు అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం శనివారం కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి దక్షిణ కొరియా పర్యటనకు బయలుదేరింది.నాలుగు రోజుల పాటు కొరాయాలో పర్యటించనున్న ఈ బృందం ఆ దేశంలోని దిగ్గజ సంస్థలతో వరుస భేటీలు నిర్వహించనుంది. తొలిరోజు ఉదయం యూయూ ఫార్మా ప్రతినిధులతో సామావేశమై తెలంగాణాలో పెట్టుబడుల అంశంపై చర్చించనుంది. ఆ తర్వాత కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనుంది.

హూండేయ్ మోటార్ సంస్థకు చెందిన సీనియర్ అధికారులతో సమావేశం నిర్వహించి చర్చలు జరపనుంది. వాటర్ సర్క్యులేషన్ డైరెక్టర్ జనరల్‌తో సమావేశం అనంతరం కొరియా హెరాల్డ్‌తో భేటీ ఎంటుందని సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. రెండోరోజు మంగళవారం రేవంత్ బృందం హ్యాన్ రివర్ ప్రాజెక్టు డిప్యూటీ మేయర్‌తో సమావేశం కానుంది.ఆ తర్వాత కొరియా బ్యూటీ ట్రేడ్ అసోసియేషన్ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. సామ్‌సంగ్ ప్రెసిడెంట్ జెబ్ల్యూ కిమ్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, సెల్‌ట్రాన్ సంస్థల అధినేతలతో రేవంత్ బృందం వరుస భేటీలు నిర్వహించనుంది. అదే రోజు హ్యాన్ రివర్ పార్క్ టూర్ నిర్వహించి స్థానికంగా రివర్ ఫ్రంట్ ఏరియాను సందర్శించనుంది.

# కొత్త రేషన్ కార్డులకు గ్రీన్ సిగ్నల్..

(మొదటి పేజీ తరువాయి)

నుంచి సూచనలు తీసుకోవా లని పౌరసరఫరాల శాఖ కార్యదర్శి డి.యస్ చౌహన్ కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. డాక్టర్ ఎన్.సి.సక్సేనా కమిష నర్ గా ఉన్న సక్సేనా కమిటీ సిఫారసులను కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీలో పరిగణనలోకి తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు.

**వలస దారులకు ఒకటే ఆప్షన్..**

ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వలస వచ్చిన వారికి అక్కడ ఇక్కడ రెండు చోట్లా తెల్లకార్డులు ఉన్నట్లు తేలిందన్నారు. అలాంటి వారికి ఒక్కచోటనే ఆప్షన్ ఇవ్వాలనే ప్రతిపాదనపై ఉప సంఘం చర్చించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడవుగా కొత్త తెల్ల రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులు బాటు ఇవ్వడంతో పది లక్షల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 956.04 కోట్లు ఖర్చు చేయబోతుందన్నారు.

# మొద్దు నిద్ర వీడని ప్రభుత్వం



- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

రాష్ట్రంలో వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడం అత్యంత దారుణం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీధి కుక్కల దాడులపై పలుమార్లు హైకోర్టు హెచ్చరించినా కాంగ్రెస్ సర్కార్ మొద్దు నిద్ర వీడట్లేదని మండిపడ్డారు. శుక్రవారం ఒక్కరోజే వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిలో పసికందు మృతదేహాన్ని కుక్కలు పీక్కతినడం, హైదరాబాద్ శివారులోని నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో మరో దివ్యాంగ చిన్నారి మర్మాంగాలపై కుక్కల దాడి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నాలుగేళ్ల చిన్నారి కుక్కల దాడిలో గాయాలపై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి.. వంటి హృదయవిధారక ఘటనలు జరగటాన్ని చూసి కూడా ప్రభుత్వం చలించకపోవడం అమానవీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

బతికున్న మనుషులను సైతం కుక్కలు చంపి పీక్కుతిన్న సంఘటనలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయని చెప్పారు.రాష్ట్రంలో 3,79,156 వీధి కుక్కలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హైకోర్టుకు తెలిపింది. కానీ వీటి సంఖ్య ఇంతకు రెట్టింపు ఉంటుంది అని ప్రజలు భావిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు.

గ్రామాల్లో, పట్టణాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు నిలిపివేయడం వల్ల పారిశుధ్య నిర్వహణ పడకేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. చెత్తాచెదారం పేరుకుపోయిన ప్రాంతాల్లో వీధికుక్కల బెడద మరింత ఎక్కువైంది. మున్సిపల్ టౌన్లలో పురపాలక శాఖ వైఫల్యం వల్ల వీధి కుక్కల నియంత్రణ లేకుండా పోయింది. అంతే కాక సరైన నిధుల కేటాయింపు లేక కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసే వ్యవస్థ కూడా అసలు సరిగా పనిచేయడం లేదు. దీనివల్ల వీధి కుక్కల సంతానం విపరీతంగా పెరిగిపోయింది. ఇప్పటికే పలుమార్లు హైకోర్టు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్ర వదలడం లేదు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

"ప్రభుత్వం వెంటనే కుక్కకాటు దాడులు అరికట్టే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలి. ఇప్పటివరకు జరిగిన కుక్కకాటు ఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ప్రాణాలు కోల్పోయిన వారికి, గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా కుక్కకాటు బాధితులకు తక్షణ వైద్యం అందేలా చూడాలి, యాంటీ రేబీస్ మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాలి. దీంతోపాటు వీధి కుక్కల నియంత్రణ కోసం సమగ్ర కార్యాచరణ అమలు చేయాలి. క్రమం తప్పకుండా మానిటర్ చేస్తూ సంఖ్య పెరగకుండా చూసుకోవాలి" అని హరీశ్‌రావు సూచించారు.

# వేములవాడలో సాగు నీటి ఇబ్బందులు దూరం చేస్తా...





- నియోజకవర్గంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..
- లో లెవెల్ వంతెనల స్థానంలో హై లెవెల్ వంతెనలు నిర్మిస్తాం..
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ**

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రూ.325 కోట్లతో పనులు చేపట్టి నియోజకవర్గంలోని చెరువుల నింపి,సాగు నీటి ఇబ్బందులను దూరం చేస్తానని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.శనివారం చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లేందుకు రూ. 25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి భూమి పూజ నిర్వహించారు . ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రవరం గ్రామంలో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి 33/11 కెవి సబ్ స్టేషన్ మంజూరు అయిందని, రుద్రంగిలో రూ. కోటి నలభై లక్షల వ్యయంతో ఆసుపత్రి నిర్మాణానికి ఇటీవల భూమి పూజ చేశామని,చందుర్తి లో నిర్మిస్తున్న ఆసుపత్రిని త్వరలో సందర్శిస్తామని అన్నారు.

లో లెవెల్ వంతెనలు ఉన్న చోట హై లెవెల్ వంతెనలు నిర్మిస్తామని, రోడ్లు అవసరమైన గ్రామలకి వేయిస్తామని అన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయని, పోస్ట్ మార్టం సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేయిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ భూమేశ్వర్, ఎంపీడీఓ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి..**

విద్యార్థులకు నిత్యం నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . వేములవాడ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ , కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయం లో వసతులు, పాఠ్యాంశాల బోధన పై అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాలకు వినియోగించే కూరగాయలు, వస్తువులను, సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాలయం లో స్వచ్ఛత.. పరిశుభ్రత పాటించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ నేరాలకు గురైతే ట్రోల్ ఫ్రీ నంబర్ 1930 కి కాల్ చేయండి
- ఎస్పీ అఖిల్ మహాజన్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

సైబర్ నేరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుంటూ వారి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ సైబర్ నేరాలకు చెక్ పెట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మన బలహీనతనే సైబర్ నేరగాళ్ల బలం అని,తక్కువ సమయంలో డబ్బులు సంపాదన, వ్యక్తి గత విషయాలు పంచుకోవడం ,మన ప్రమేయం లేకుండా వచ్చే ఓటిపి షేర్ చేయడం, ఆన్లైన్ లో ఉద్యోగాల కోసం వెతకడం,ఆన్లైన్ కస్టమర్ కేర్ నంబర్స్ వెతకడం,మొబైల్ ఫోన్ కి వచ్చే అనుమానిత లింక్స్ పెరితో ఎరవేసి క్లిక్ చేయగానే మన అకౌంట్ లో ఉన్న డబ్బుకు ఊడ్చేస్తారని అన్నారు. సైబర్ మోసాలు ఎక్కవగా జరుగుతున్నయని, ఇట్టి సైబర్ మోసాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సైబర్ మోసగాల్లో చేతిలో మోసపోయిన బాధితుల కోసం జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ లో సైబర్ వారియర్స్ ని నియమించడం జరిగిందని, సైబర్ నేరాలకు గురైనవారు నేరుగా మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో లేదా ట్రోల్ ఫ్రీ నంబర్ 1930 కి కాల్ చేసి పిర్యాదు చేయలని తెలిపారు.

# ఆగస్టు 15లోపు జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఎగరవేయాలి

- బీజేపీ నాయకులు
- దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు..



**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ బిజెపి మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 లోపు జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఎగరవేయాలని, దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల ప్రజలందరూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయలని కోరారు.12వ తారీకు సోమవారం రోజున కరీంనగర్ పట్టణంలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో హర్ గర్ తిరంగా యాత్ర బైక్ ర్యాలీ నిర్వహించాలని, కావున ప్రజలు కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని జాతీయవాదాన్ని జాతి ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు మద్దుల బుగ్గారెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి బంధారపు లక్ష్మారెడ్డి,మండల ఉపాధ్యక్షులు కృష్ణ హరి,ఓబీసి మోర్చ అధ్యక్షులు బొమ్మాడి స్వామి, శ్రీకాంత్, ఓ బి సి మోర్చా ఉపాధ్యక్షులు మిరియాల రవి, యువ మోర్చా ఉపాధ్యక్షులు మనుక రాజు యాదవ్,పట్టణ అధ్యక్షుడు నంది నరేష్, బాలా గౌడ్, బూత్ అధ్యక్షులు డీటి నరసయ్య, దొంతి రాజేందర్ రెడ్డి,గాజుల దాసు, బుర్కా వేణు,యమగోండ కృష్ణారెడ్డి,ఎండి అబ్దుల్ మియా, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

- గోశాలలో కోడెలకు సకల వసతులు..
- అధునాతన పద్ధతుల్లో షెడ్లు నిర్మాణం..
- జీవాలకు మేలైన దాణా, పచ్చగడ్డి..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**బలగం టీవీ , వేములవాడ:**

రాజన్న ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని, దానికి నిదర్శనమే మొన్నటి బడ్జెట్లో 50 కోట్ల నిధులను కేటాయించామని,త్వరలో శృంగేరి పీఠానికి వెళ్లి వారి అనుమతితో ఆలయ విస్తరణ చేపడతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.శనివారం వేములవాడ లోని తిప్పాపూర్ లోని రాజన్న గోశాలలో ఆలయ నిధులు రూ. 61 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్,కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం అదే ఆవరణలో రూ. 66 లక్షలతో నిర్మించిన మూడు షెడ్లను ప్రారంభించి, వేములవాడ జాతర గ్రౌండ్ లోని ఆలయ గోశాలలో రూ. 50 లక్షల అంచనాలతో రెండు షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం వన మహెూత్సవంలో భాగంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి గుడి చెరువు ప్రాంగణంలో కదంబ మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయంలో ఆ స్వామి వారికి కోడే మొక్కు చెల్లించడం అత్యంత ప్రీతి పాత్రమైనదని వ, చాలామంది భక్తులు స్వామివారిని దర్శించుకుని కోరిన కోరికలను తీర్చు తండ్రి అని, ఎంతో ఇష్టంగా స్వామి వారికి కోడే మొక్కులను చెల్లించుకుంటారని అన్నారు.గోవులకు కోసం అధునాతన పద్ధతులలో మరిన్ని నూతన షెడ్ల నిర్మాణం చేపడతామని అన్నారు . సీఎం, దేవాదాయ శాఖ మంత్రి సూచనలతో కలెక్టర్ తో కమిటీ వేసి భక్తులు చెల్లించిన కోడలను పేద రైతులకు అందించామని అన్నారు.

. కోడెలకు అధునాతన వైద్యం అందిస్తూ, నాణ్యమైన దాణా, పచ్చి గడ్డి అందించేలా చర్యలు చేపడుతున్నామని, రాజన్న గోశాలలో సకల వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

వన మహెూత్సవంలో భాగంగా ఆలయ సువిశాల ప్రాంగణంలో మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, దేవాలయానికి అనుబంధమైన చెట్లను ఎంపిక చేసుకొని వాటిని నాటడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమాలో ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్,వేములవాడ అర్బన్ తహసీల్దార్ మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు టీజీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్






ఈ నెల 19వ తేదీన రాఖీ పండుగ నేపథ్యంలో మహిళలకు టీజీఎస్ఆర్టీసీ తీపి కబురు అందించింది. దూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు సోదరీమణులు రాఖీలు పంపేందుకు వీలుగా పండుగకు నాలుగైదు రోజుల ముందుగానే కార్గో కేంద్రాలలో ప్రత్యేక కౌంటర్లు తెరవాలని నిర్ణయించింది. ఇందుకోసం అన్ని బస్టాండ్లలోని కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రాఖీలతో పాటు స్వీట్ బాక్సులు, బహుమతులు కూడా పంపే అవకాశం కల్పించింది. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఏపీ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు రాఖీలను పంపించుకోవచ్చని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. కార్గో సెంటర్లలో బుక్ చేసిన 24 గంటల్లోనే రాఖీలను డెలివరీ చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అయితే, రాఖీల రవాణా ధర ఇంకా ఖరారు కాలేదు. ధరల విషయంలో సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# బహరేన్ జైలులో చీర్లవంచ వాసి మానువాడ నర్సయ్య

- 28 ఏళ్ల నుండి బహరేన్ లోనే
- పాస్‌పోర్ట్, వీసా లేనందున జనవరిలో జైలు పాలు..

**బలగం టీవీ , సిరిసిల్ల :**



సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన 62 ఏండ్ల మానువాడ నర్సయ్య జనవరి నుంచి బహరేన్ జైలులో మగ్గుతున్నాడు. 28 ఏళ్ల క్రితం బహరన్ దేశం వెళ్లి, ఇండియాకు తిరిగి రాక,అక్కడే ఉండిపోయాడు.పాస్ పోర్ట్,వీసా లేనందున జనవరిలో జైలు పాలయ్యాడు. ప్రస్తుతం జైల్లోనే మగ్గుతున్నాడు. చీర్లవంచ గ్రామం మధ్య మానేరు ప్రాజెక్టులో ముంపుకు గురవడం వలన నర్సయ్య కుటుంబం ప్రస్తుతం అగ్రహారం పునరావాస కాలనీలో నివసిస్తున్నారు.

28 ఏళ్ల క్రితం మానువాడ నర్సయ్య 1996 లో బహరేన్ దేశానికి వెళ్లాడు, అప్పుడు నర్సయ్య వయస్సు 34 ఏళ్ళు. హైదరాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం 1989 సెప్టెంబర్ 22న పాస్‌పోర్ట్ జారీ చేశారు,బహరేన్ ఇండియన్ ఎంబసీ 2001 నవంబర్ 18న పాస్ పోర్ట్ ను రెనివల్ చేశారు. ఇప్పుడు దాని గడువు ముగిసిపోయింది. జనవరి నెలలో పాస్ పోర్ట్, వీసా లేకపోవడంతో బహరన్ పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపించారు.బహరేన్ ప్రభుత్వ సంస్థ 'లేబర్ మార్కెట్ రెగ్యులేటరీ అథారిటీ' 2024 జనవరి 8న బహరేన్ లోని భారత రాయబారికి ఒక లేఖ రాయడంతో నర్సయ్య ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నర్సయ్య పాస్‌పోర్ట్ అందుబాటులో లేదు అని,చట్టవిరుద్ధమైన స్థితిలో ఉన్నాడు అని,ఇతన్ని బహరేన్ నుంచి భారత్ కు పంపించడం (డిపోర్ట్) కోసం ఇండియన్ ఎంబసీ 'అవుట్ పాస్' (తాత్కాలిక పాస్‌పోర్ట్) జారీ చేయాలని ఆ లేఖలో కోరారు. బహరేన్ లోని ఇండియన్ ఎంబసీ ఆగస్టు 4న హైదరాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయానికి ఒక లేఖ రాసి,మానువాడ నర్సయ్యను అతని ఫోటోను ధ్రువీకరించాలని కోరారు. హైదరాబాద్ పాస్‌పోర్ట్ అధికారి పాత రికార్డులను సెర్చ్ చేసి మానువాడ నర్సయ్య చిరునామా కనుక్కొని, సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ల ద్వారా నివేదిక తెప్పించి బహరేన్ లోని ఇండియన్ ఎంబసీకి పంపిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. మానువాడ నర్సయ్య విషయాన్ని బహరేన్ లోని సామాజిక కార్యకర్త నోముల మురళి, హైదరాబాద్ లోని టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి దృష్టికి తెచ్చారు.ఈ మేరకు ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి సంబంధిత అధికారులకు 'ఎక్స్' ద్వారా ట్వీట్ చేశారు. నర్సయ్య కు గతంలో నివసించిన గోపాల్ రావుపల్లి గ్రామ రేషన్ కార్డు, ఓటరు కార్డు మాత్రమే ఉన్నాయి, ఇప్పుడు అతను భారతీయుడు అని నిరూపించుకోవడానికి ఆధారంగా పనికివస్తున్నాయి. నర్సయ్య ను భారత్ కు తెప్పించాలని భార్య లక్ష్మి, కూతుళ్లు సోన, అపర్ణ, కుమారుడు బాబు కోరుతున్నారు.

# సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు



**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి సీఎంఆర్ఎఫ్ 11 చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నేరుగా అందించారు.మండల కేంద్రానికి చెందిన 11 చెక్కులకు 2 లక్షల 68 వేల 500 రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశామని అన్నారు. మండల కేంద్రానికి శ్రీరామోజీ అంజలి సిఎంఆర్ చెక్కును దరఖాస్తు చేసుకొని సంవత్సరం గడిచిన ఇంతవరకు రాలేదని ఎడ్ల సందీప్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా అతి త్వరలో చెక్కును మీ చేతికి అందిస్తానని సదర్ మహిళకు హామీ ఇచ్చాడు.ఈ కార్యక్రమంలో భాగంగా కేడీసీసీ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షురాలు అప్సర ఉనిస,ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ 1 పందిళ్ళ నాగరాణి పరశురాం గౌడ్,మాజీ ఎంపిటిసి 2 ఎనుగందుల నరసింహులు అనసూయ, పట్టణ కేడీసీసీ డైరెక్టర్ నేవూరి వెంకటనరసింహ రెడ్డి,మాజీ వార్డు సభ్యులు దేవేందర్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్లమందు బాలా గౌడ్, సీనియర్ నాయకులు అజిముద్దిన్ మాజీ మైనార్టీ అధ్యక్షులు అస్సన్ బ్రహ్మాచారి యూత్ సభ్యులు చందనం శివరామకృష్ణ ,పవన్ గౌడ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు..

# సుంకిశాల'పై సమగ్ర దర్యాప్తు జరపాలి..



**సీపీఐ(ఎం) డిమాండ్**

**బలగం టీవీ ,హైదరాబాద్**

సుంకిశాల సైడ్‌వాల్ కూలిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, అందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన ప్రాంతాన్ని సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. నిర్మాణ పనులు చేస్తున్న మెగా ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాలపరిమితిలో నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ఈ ప్రాజెక్టుపై జరుగుతున్న పనులను పర్యవేక్షించడం లేదన్నారు. కూలిపోయిన సమయంలో పనిచేసే వారు లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదన్నారు.పర్వేదుల నుంచి సుంకిశాల ప్రాజెక్టు వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉందని.. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పనులు కూడా చేయలేదన్నారు. నిర్మాణం చేస్తున్న సంస్థ కొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని, వరదలు పైనుంచి వస్తున్నప్పుడు సిమెంట్ పనులు చేయడం, సరిగా క్యూరింగ్ కాలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జరుగుతున్న పనులపై నిరంతరం పర్యవేక్షణ పెట్టి త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని కోరింది. ఈ ప్రతినిధి బృందంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండా శ్రీశైలం, కూనురెడ్డి నాగిరెడ్డి, చిన్నపాక లక్ష్మీనారాయణ, మహమ్మద్ సలీం, పీ నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, షేక్ బషీర్, పూల సత్యనారాయణ, దుబ్బ రామచంద్రం, బాపురెడ్డి ఉన్నారు.

# 10 మంది డిప్యూటీ కమిషనర్లకు షోకాజ్ నోటీసులు

- జారీ చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

**బలగం టీవీ ,హైదరాబాద్**



గ్రేటర్‌లో ఇంటింటి చెత్త సేకరణ, జీవీపీ పాయింట్లు (తరచూ చెత్త వేసే ప్రాంతాల) ఎత్తివేతలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కఠిన చర్యలకు కమిషనర్ ఉపక్రమించారు. కార్మికుల అటెండెన్స్ పారదర్శకంగా ఉండేందుకు ఇటీవల ఫేషియల్ రికగ్నిషన్ తీసుకొచ్చినా.. 100 శాతం అటెం డెన్స్ లేకపోవడం, ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరపకపోవడం, జీవీపీ పాయింట్ల ఎత్తివేతలో నిర్లక్ష్యం..అన్నింటికంటే పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు ఉందని పేర్కొంటూ.. 10 మంది డిప్యూటీ కమిషనర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.24 గంటల్లో వివరాలు ఇవ్వాలని సదరు ఉత్తర్వులో కమిషనర్ పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారిలో చార్మినార్, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, కార్వాన్, ముషీరాబాద్, బేగంపేట, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా తదితర సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు ఉన్నారు. అయితే డీసీలతో పాటు క్షేత్రస్థాయిలో మెరుగైన పారిశుధ్య నిర్వహణలో అత్యధికంగా డీఈ, మెడికల్ ఆఫీసర్ల బాధ్యత కూడా ఉంటుంది. అయితే వీరిని కాదని కేవలం డీసీలకే షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

# వివాదాస్పద బాక్సర్‌కు గోల్డ్ మెడల్



బలగం టీవీ,పారీస్

వివాదాస్పద మహిళా బాక్సర్ ఇమేనీ ఖాలిఫ్ గోల్డ్ మెడల్ గెలిచింది. వెల్టర్‌వెయిట్ క్యాటగిరీ ఫైనల్లో చైనా క్రీడాకారిణిపై విజయం సాధించింది. 2022 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ గెలిచిన ఖాలిఫ్.. ఆ తర్వాత లింగ వివాదాన్ని ఎదుర్కొన్నారు. ఆమెలో వై క్రోమోజోమ్‌లు ఎక్కువగా ఉన్నట్లు కొన్ని రిపోర్టుల ద్వారా తేలింది. పారిస్ ఒలింపిక్స్‌లోనూ ప్రీక్వార్టర్స్ లో ఇటలీ బాక్సర్.. కేవలం 46 సెకన్లలోనే మ్యాచ్ నుంచి వైదొలిగింది. ఫైనల్ కోసం ఎరుపు రంగు దుస్తుల్లో రింగ్‌లోకి రాగానే.. స్టేడియంలో ఇమేనీ ఇమేనీ అంటూ అరుపులు మారుమోగాయి. ఆ వాతావరణంలో చైనా బాక్సర్ యాంగ్ ఒంటరి అయిపోయారు. తొలి రౌండ్‌లోనే ప్రత్యర్థికి లెఫ్ట్, రైట్ హుక్ ఇచ్చింది ఖాలిఫ్. పూర్తి కంట్రోల్ తీసుకుని .. ఈజీగా చైనీస్ అమ్మాయిని ఓడించి స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకున్నది. బాక్సింగ్ టైటిల్ గెలిచిన అల్జీరియా తొలి మహిళా బాక్సర్‌గా ఆమెకు గుర్తింపు ఉన్నది. ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలవాన్న సంకల్పం ఉండేదని, 8 ఏండ్ల తన కల ఫలించినట్లు ఆమె పేర్కొన్నది.

2023 వరల్డ్ చాంపియన్‌షిప్ సమయంలో జెండర్ పరీక్ష ద్వారా ఇమేని ఖాలిఫ్‌ను అనర్హురాలిగా ప్రకటించారు. కానీ పారిస్ ఒలింపిక్స్ కోసం మాత్రం.. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ.. 2016, 2021 నాటి ఒలింపిక్స్ రూల్స్‌ను అమలు చేసింది. దీంతో బాక్సర్ ఖాలిఫ్‌కు పారిస్‌లో ఆడేందుకు అవకాశం దక్కింది.

# ముగింపు వేడుకల్లో పతాకధారిగా గోల్‌కీపర్

బలగం టీవీ,పారీస్

విశ్వక్రీడలు ఒలింపిక్స్ ముగింపోత్సవ కార్యక్రమంలో భారత పతాకధారిగా హాకీ గోల్‌కీపర్ శ్రీజేశ్‌కు కూడా అవకాశం దక్కింది. ఇప్పటికే యువ షూటర్ మను బాకర్‌ను ముగింపు వేడుకల్లో పతాకధారిగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా సీనియర్ గోల్‌కీపర్ శ్రీజేశ్‌కు కూడా అవకాశం కల్పించారు. ఈ విషయాన్ని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష వెల్లడిచారు. శ్రీజేశ్ గత రెండు దశాబ్దాలకుపైగా భారత హాకీ ఎనలేని సేవలందించారన్నారు. అంతేగాక భారత హాకీ వరుసగా రెండు ఒలింపిక్స్‌లోనూ కాంస్య పతకాలు సాధించడంలో శ్రీజేశ్‌ది కూడా చాలా కీలకపాత్ర అని ఉష పేర్కొన్నారు. ఇలాంటి ఆటగాడికి అరుదైన గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో ముగింపు వేడుకల్లో పతాకధారిగా అవకాశం కల్పించినట్టు ఉష తెలిపారు. శ్రీజేశ్‌ను పతాకధారిగా ఛాన్స్ ఇవ్వాలని చాలా మంది క్రీడాకారులు కోరారని, జావెలిన్ త్రో ఆటగాడు నీరజ్ చోప్రా కూడా దీనికి సుముఖత వ్యక్తం చేసినట్టు వెల్లడించారు. అందరి అభిష్ఠం మేరకు శ్రీజేశ్‌కు ఈ అరుదైన అవకాశం కల్పించినట్టు ఉష వివరించారు.




# ఫ్యాన్స్ అందరికీ క్షమాపణలు : నీరజ్ చోప్రా



బలగం టీవీ,పారీస్

పారిస్ ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ మిస్ అవ్వడంపై భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా తన ఫ్యాన్స్ అందరికీ క్షమాపణలు తెలిపాడు. 'అందరికీ సారీ. ఒలింపిక్ పోడియంపై టోక్యో మాదిరి పారిస్‌లో మన జాతీయ గీతం ఈసారి ప్లే అవ్వలేదు. పారిస్‌లో నేను ఆశించిన పతకం సాధించలేకపోయా' అని నీరజ్ తాజాగా వ్యాఖ్యానించాడు. అయితే నీరజ్‌కు నెటిజన్లు సోషల్ మీడియాలో మద్దతుగా నిలుస్తున్నారు. నీరజ్ క్షమాపణలు చెప్పే అవసరం లేదని పేర్కొన్నారు.

గత ఒలింపిక్స్‌లో అంచనాలు లేకుండా బరిలో దిగిన నీరజ్ స్వర్ణ పతకం సాధించి సంచలనం సృష్టించాడు. దీంతో ఈసారి జావెలిన్‌లో నీరజ్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పక్కా పసిడి సాధిస్తాడన్న ధీమా ఉండింది. కానీ, గురువారం జరిగిన ఫైనల్‌లో అనూహ్యంగా పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ స్వర్ణం ఎగరేసుకుపోయాడు. ఈ పోటీలో రెండో స్థానంలో నిలిచిన నీరజ్ రజతంతో సరిపెటుకోవాల్సి వచ్చింది.

# 'అవతార్.. పార్ట్ 3 అనౌన్స్‌మెంట్

- 'అవతార్ : ఫైర్ అండ్ యాష్' గా అనౌన్స్ చేసిన జేమ్స్ కామెరూన్
- 2025 డిసెంబర్ 19న విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

టైటానిక్, అవతార్, అవతార్ ది వే ఆఫ్ ది వాటర్ సినిమాలతో బ్లాక్ బస్టర్‌లను అందుకున్న హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ అవతార్ సినిమాకు సీక్వెల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఫ్రాంచైజీ నుంచి అవతార్, అవతార్ ది వే ఆఫ్ ది వాటర్ చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీ నుంచి మూడో భాగం రానున్నట్లు ఒక ఈవెంట్‌లో అధికారికంగా వెల్లడించారు. కామెరూన్.

అవతార్ మూడవ భాగం అవతార్– ఫైర్ అండ్ యాష్ అనే పేరుతో రాబోతున్నట్లు ప్రకటించాడు. ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 19 2025న విడుదల చేయనున్నట్లు వెల్లడించాడు. మొదటి భాగంలో గాలి,




రెండో భాగంలో నీటిని మూడో భాగంలో నిప్పును ఇలా పంచభూతాల కాన్సెప్ట్‌ను ప్రధాన అంశంగా తీసుకుని సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తున్నది. వరల్డ్ సినిమా హిస్టరీలో అత్యధిక గ్రాస్ సాధించిన చిత్రాలలో అవతార్ చిత్రాలు టాప్ టెన్‌లో ఉంటాయి. ఇక అవతార్ 2 అయితే ప్రపంచవ్యాప్తంగా 160 భాషల్లో సుమారు 55 వేలకుపైగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. సామ్ వర్తింగ్‌టన్, జోయ్ సాల్డన, కేట్ విన్స్‌లెట్, స్టీఫెన్ లాంగ్ ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించారు.

ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఈసారి సినిమాలో పాత్రలపై ఎక్కువ దృష్టి సారిస్తాము. మంచి కథనంతో భారీ విజువల్స్‌తో అలరించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. మీ అంచనాలకు మించిన లైవ్–యాక్షన్‌ని ఇందులో చూస్తారు మరో కొత్త ప్రపంచాన్ని భిన్నమైన కథనం, విభిన్నమైన పాత్రలు ఇందులో కనిపిస్తాయి. 'అవతార్: ది వే ఆఫ్ వాటర్'లో కనిపించిన కేట్ విన్స్‌లెట్ చేసిన రోనాల్ క్యారెక్టర్‌ను అవతార్ 3లో మరింత పొడిగించాము. అందుకోసం ఆమె చాలా కష్టపడి శిక్షణ తీసుకుంటుంది' అని అన్నారు. అవతార్ ఫ్రాంచైజీలో రానున్న 'అవతార్ 4' 2029లో, చివరిగా రానున్న 'అవతార్ 5' డిసెంబరు 2031లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం గతంలో తెలిపింది.



# స్పెషల్ డేను మరింత ప్రత్యేకంగా చేశారు

- మహేశ్‌బాబు ట్వీట్

బలగం టీవీ, హైదరాబాద్

సూపర్ స్టార్ మహేశ్ బాబు తన అభిమానులను ఉద్దేశించి ఆసక్తికర పోస్టు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. శుక్రవారం మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఆయనకు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలిపిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మహేశ్ బాబు తన ఫ్యాన్స్‌కు థాంక్యూ చెప్పారు. "నిన్న నా పుట్టినరోజు సందర్భంగా మీరు పంపించిన సందేశాలు, చూపించిన ప్రేమాభిమానాలు చూసి ఆనందంతో ఉప్పొంగిపోయా. మీరందరూ ఈ స్పెషల్ డేని నాకు మరింత ప్రత్యేకంగా మారేలా చేశారు. ప్రతి ఏడాది మీరు నాపై చూపిస్తోన్న ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు. లవ్ యూ" అని మహేశ్ బాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అందుకు లవ్ యూ అన్నా అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.



# 'ముఫాసా: ది లయన్ కింగ్' ట్రైలర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

1994లో ది లయన్ కింగ్' యానిమేటెడ్ క్లాసిక్ నవల్ ఆధారంగా వచ్చిన 'ది లయన్ కింగ్'. చిత్రం హాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. అయితే ఈ సినిమాకు ప్రీక్వెల్ వస్తున్న విషయం తెలిసిందే. 'ముఫాసా: ది లయన్ కింగ్' అంటూ ఈ సినిమా రానుంది. ఇప్పటికే టీజర్ విడుదల చేసిన మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను వదిలారు.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. మొదటి రెండు పార్ట్‌లలో అడవికి రాజుగా ఉన్న ముఫాసా తన రాజ్యాన్ని కాపాడుతూ ఉండడం అతడికి సింబా అనే కుమారుడు జన్మించడం చూడవచ్చు. అయితే ఈ ప్రీక్వెల్‌లో ముఫాసా అడవికి రాజుగా అసలు ఎలా ఎదిగాడు అతడికి సోదరుడు ఉన్నటాకా ఎలా చనిపోయాడు అనే విషయాలు చూపించబోతున్నట్లు తెలుస్తుంది. అద్భుతమైన విజువల్స్‌తో యాక్షన్ అడ్వెంచర్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రస్తుతం యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఆరోన్ స్టోన్, కెల్విన్ హ్యారిసన్ జూనియర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అకాడమీ అవార్డ్ విజేత బేరీ జెంకిన్స్ దర్శకుడు. ఇక ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది

